


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
డిసెంబరు 15, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తాం!



సామాజిక తెలంగాణే ధ్యేయం..
త్వరలోనే పార్టీ.. దానికి ప్రజలు సూచించిన పేరే పెడతాం

యువత, మహిళలకు అవకాశాలిస్తాం

రేవంత్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

'అస్క్ కవిత' కార్యక్రమంలో
నెటిజన్లతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



## ప్రధాని మోడీని ఎవరూ దూషించలేదు

ఏమీ లేకుండానే బీజేపీ రాద్ధాంతం చేస్తోంది

ఎవరో కార్యకర్త అన్నదాన్ని సభలోకి ఎందుకని ప్రశ్న

## పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

పేదలపై భారంగా కేంద్ర కొత్త బిల్లు

నిధుల కోతలతో గ్రామీణ పేదలకు దెబ్బ

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : సీతక్క

# మూడో దశకు రంగం సిద్ధం

పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగింపు

బుధవారం 3,752 సర్పంచ్ స్థానాలకు పోలింగ్

గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా




హైదరాబాద్: రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఈ విడతలో భాగంగా బుధవారం (17న) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు. అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నారు. మూడో విడత ఎన్నికలకు సంబంధించి గ్రామ పంచాయతీల్లో ఏర్పాట్లను అధికారులు వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ప్రీపోల్ ఏర్పాట్లలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రిని సోమవారం నుంచే పోలింగ్ కేంద్రాలకు

- మిగతా 2వ పేజీలో



## దేవుడిని విశ్రాంతి కూడా తీసుకోనివ్వరా?

డబ్బులిచ్చే ధనవంతులకు ప్రత్యేక పూజలంటూ అంతరాయం కల్గిస్తారా?

బృందావన్‌లోని బంకీ బిహారీ జీ ఆలయ నిర్వాహకులపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఆలయాల్లో ధనవంతులిచ్చే డబ్బుల కోసం కక్కుర్తిపడి దేవుడి విశ్రాంతి వేళలోనూ ప్రత్యేక పూజలకు అనుమతించడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దేవుడి విశ్రాంతికి అంతరాయం కల్గిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. బృందావన్‌లోని

- మిగతా 2వ పేజీలో



## ఇకపై ఇంటి నుంచే యూరియా బుకింగ్

రైతుల కోసం ప్రత్యేక మొబైల్ యాప్

రబీ సీజన్ నుంచి డిజిటల్ విధానం

డిసెంబర్ 20 నుంచి ప్రయోగాత్మక అమలు

క్యూలైన్లకు గుడ్‌బై: మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 15 : యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే పరిస్థితికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యూరియాను ఇంటి నుంచే మొబైల్ ద్వారా బుక్ చేసుకునేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టనుంది. రబీ సీజన్ ముందస్తు ఏర్పాట్లపై సోమవారం నిర్వహించిన సమీక్షలో ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఎరువుల యాప్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. యూరియా సరఫరాలో పారదర్శకత పెంచడంతో పాటు, పక్కదారి పట్టకుండా పంటలు సాగు చేసే రైతులకే అందించడమే ఈ విధానం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. యూరియా అధిక వినియోగం వల్ల భూసారంపై పడే ప్రభావాలపై రైతులకు అవగాహన

- మిగతా 2వ పేజీలో

## ఉపాధి హామీకి కొత్త పేరు

మహాత్మాగాంధీ పేరు తొలగించిన కేంద్రం

125 రోజులకు ఉపాధి గ్యారెంటీ పెంపు

రాష్ట్రాలకు కోటా విధానం, అదనపు ఖర్చు భారం

లోక్‌సభలో వీబీ-జీరామ్‌జీ బిల్లు ప్రవేశం




న్యూఢిల్లీ, డిసెంబరు 15: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కొత్త పేరు, కొత్త రూపాన్ని తీసుకొచ్చింది. ఇప్పటివరకు అమలులో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇకపై 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్%-%గ్రామీణ్ (వీబీ%-%జీరామ్‌జీ)'గా పిలవనున్నారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమవారం పాత చట్టాన్ని ఉపసంహరించి, వీబీ-జీరామ్‌జీ-2025 బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.కేవలం ఉపాధి కల్పనకే పరిమితమైన పాత చట్టానికి భిన్నంగా, కొత్త బిల్లు వికసిత భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించినట్లు మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాన్ని కలిగించే ఉమ్మడి ఆస్తుల సృష్టి, వాటిపై గ్రామస్థులకు హక్కులు కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. కొత్త బిల్లులో కీలక మార్పుగా ఉపాధి గ్యారెంటీ

- మిగతా 2వ పేజీలో





## పంచాయతీ ఎన్నికల అనంతరం హింస

ఓడిపోయిన అభ్యర్థి కుటుంబంపై ట్రాక్టర్‌తో దాడి

నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు

సోమర్‌పేటలో ఉద్రిక్తత, రాస్తారోకో

ఇతర జిల్లాల్లోనూ సర్పంచ్‌లపై దాడులు

సిర్పూర్, డిసెంబరు 15 : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమర్‌పేటలో పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే రాజకీయ కక్షలు హింసాత్మకంగా మారాయి. ఓడిపోయిన అభ్యర్థి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సర్పంచ్ సోదరుడు ట్రాక్టర్‌తో దాడికి పాల్పడిన ఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రెండురోజుల క్రితం పాపయ్య సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. ఇదే ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి బిట్ల బాలరాజు ఇంటిపై సోమవారం ఉదయం పాపయ్య సోదరుడు చిరంజీవులు దాడికి తెగబడ్డాడు. బాలరాజు ఇంటి ఎదుట కూర్చున్న మహిళలపైకి ట్రాక్టర్‌ను దూకించడమే కాకుండా, ఆపై ఇంటిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో గంజి భారతి, తోట శారద, బాలామణి, సత్తవ్వలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు. భారతి, శారద పరిస్థితి విషమంగా ఉండగా, వారిలో ఒకరి చేయి నుజ్జునుజ్జయింది. ఎన్నికల్లో ఓడిపోయిన బాలరాజును పరామర్శించిన అనంతరం ఉదయం నీరెండ సమయంలో వాకిట్లో కూర్చున్న సమయంలోనే ఈ దాడి జరిగినట్లు బాధితులు తెలిపారు. ఘటన అనంతరం

- మిగతా 2వ పేజీలో

# ఉప్పల విజయలక్ష్మి గెలుపునకై రాజన్నసభకు కదిలిన జనసంద్రం!

**ఉప్పల విజయలక్ష్మి- లింగసామిని గెలిపిస్తే మీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**గ్రామానికి సేవ చేసే నాయకుడు ఉప్పల లింగస్వామి వారిని గెలిపించుకోవడం మీ బాధ్యత**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ పార్టీ బలపరిచిన, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి గెలుపుకు ప్రచారం నిర్వహించిన, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వారు మాట్లాడుతూ మునుగోడు అభివృద్ధి కోసం నేను అసెంబ్లీలో ఎన్ని మాట్లాడినా ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని తెలిపారు. నా రాజీనామాతో టిఆర్ఎస్ ప్రభుత్వం దిగివచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిందని అన్నారు, సంస్థాన్ నారాయణపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేసే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. ఉప్పల విజయలక్ష్మి-లింగస్వామిని భారీ మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజలకు కృషి చేయాలని తెలిపారు. నారాయణపూర్ గ్రామాన్ని అండర్ డ్రైనేజీ, గ్రామ మౌలిక వసతులు కల్పించి మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి ఉప్పల విజయలక్ష్మి -లింగస్వామి స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, స్థానిక వార్డు మెంబర్లు, సిపిఐ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**మీడియా సమావేశంలో ఉప్పల లింగస్వామి**

**ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో**

**గ్రామాన్ని మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతా.!**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం గ్రామ ప్రజలు ఆశీర్వదిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అని తెలిపారు ఉప్పల లింగస్వామి, గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నాకు గ్రామ ప్రజలు అవకాశం కల్పిస్తే ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులతో గ్రామాన్ని మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దామని తెలిపారు. గ్రామంలోని ప్రతి కాలనీలో అండర్ డ్రైనేజీ పనులు నిర్మిస్తానని, గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకై కృషి చేస్తానని, గ్రామంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో ఉచిత వైద్య సౌకర్యాలు ప్రజలకు అందేలా కృషి చేస్తా అన్నారు, గ్రామంలోని గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్ది యువతకు ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన ప్రతి బుక్స్ లు మన గ్రంథాలయంలో లభించేలాగా కృషి చేస్తానన్నారు, గ్రామ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. విద్య ,ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పెంపొందించేలా కృషి చేస్తానని, గ్రామాన్ని పచ్చదనంలో పరిశుభ్రతలో మోడల్



గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని హామీ ఇస్తున్నానని అన్నారు, ఉప్పల విజయలక్ష్మి-లింగస్వామి, నా గెలుపుకు నా మన గ్రామ అభివృద్ధికి ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు

# దేవుడిని విశ్రాంతి కూడా తీసుకోనివ్వరా..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రఖ్యాత బంకీ బిహారీ జీ ఆలయంలో దర్శన వేళలతోపాటు సంప్రదాయాల్లో తీసుకువచ్చిన మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సోమవారం ఈ మేరకు స్పందించింది. బంకీ బిహారీ జీ ఆలయంలో దర్శన వేళల్లో మార్పులు చేశారని, దెహ్రి పూజ వంటి పలు ముఖ్యమైన మతాచారాలను నిలిపివేశారని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, తన్వి దుబేలు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. 'సంప్రదాయం, వేడుకల్లో దర్శన వేళలు కూడా ఒక భాగం. భక్తుల దర్శనాల కోసం ఆలయాన్ని తెరిచి ఉంచడం ఎప్పట్నుంచో వస్తున్న సంప్రదాయం. ఆలయ వేళలను మార్చితే, లోపల జరిగే పూజలు, వేడుకల వేళలు కూడా మారుతాయి. తదనుగుణంగా దేవుడి ఉదయం మేల్కొనే వేళ, రాత్రి నిద్రించే వేళలూ మారుతాయి. ఇలా జరగరాదు. తరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని, పవిత్రతను తుచ తప్పక అనుసరించాలి'అని ఈ సందర్భంగా దివాన్ వాదించారు. సెప్టెంబర్‌లో జారీ అయిన ఆఫీసు మెమోరాండం ప్రకారం ఆలయంలో జరిగే ముఖ్యమైన పూజా సంప్రదాయాల్లో మార్పులు తెచ్చారని ఆయన తెలిపారు. ఆలయంలో దర్శన వేళలు పూర్తయ్యాక, ఒక ప్రత్యేక ప్రదేశంలో చేపట్టే దెహ్రి పూజను సైతం రద్దీని నివారించేందుకంటూ రద్దు చేస్తూ తరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని పక్కనబెట్టారని పిటిషనర్లు తెలిపారు. గురు%-%శిష్య పరంపరలో భాగంగా గోస్వామీలు మాత్రమే ఈ పూజా కార్యక్రమాన్ని జరపాల్సి ఉంటుందన్నారు. ఈ వాదలనపై సీజేఐ సూర్యకాంత్ మౌఖికంగా.. 'బంకీ బిహారీ జీ ఆలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ఆలయాన్ని నామమాత్రంగా మూసివేస్తున్నారు. అయితే, ఆ వెంటనే దేవుడికి ఒక్క సెకను కాలం కూడా విశ్రాంతినివ్వకుండా, ఇతర విషయాల మాదిరిగానే దేవుడిని కూడా వాడేసుకుంటున్నారు. భారీగా డబ్బు ఇవ్వజూపే ధనవంతుల కోసం ప్రత్యేక పూజలకు అనుమతిస్తున్నారు'అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై సమాధానమివ్వాలని ఆలయ నిర్వహణ కమిటీతోపాటు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. జనవరి మొదటి వారంలో తదుపరి విచారణ చేపడతామని ప్రకటించింది. వాస్తవానికి ఈ ఆలయంలో వేడుకలు, పూజలు, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ 1939 నాటి నిబంధనల ప్రకారం జరుగుతోంది. అయితే, 2025లో తీసుకువచ్చిన ఉత్తరప్రదేశ్ శ్రీ బంకీ బిహారీ జీ ఆలయ ట్రస్ట్ ఆర్డినెన్స్‌తో రాష్ట్ర



ప్రభుత్వం మత సంస్థల్లో జోక్యం చేసుకునేందుకు అవకాశ మేర్పడింది. తద్వారా అనాదిగా వస్తున్న ఆచార సంప్రదాయాలకు విఘాతం కలుగుతోందన్న వాదనలు ఉన్నాయి. దీనిపై ఈ ఏడాది ఆగస్ట్‌లో దాఖలైన పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. వ్యవహారాన్ని అలహాబాద్ హైకోర్టుకే విడిచిపెట్టింది. అదే సమయంలో, హైకోర్టు స్పష్టత ఇచ్చే వరకు ఆర్డినెన్స్‌పై స్టే విధించింది. ఆలయ రోజువారీ వ్యవహారాల పర్యవేక్షణకు అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి అశోక్ కుమార్ సారథ్యంలో కమిటీని నియమించింది.





## గ్రామ ప్రజలకు గ్రామ అభివృద్ధి ముఖ్యం! అభివృద్ధి చేసే వారికి ఓటు వేద్దాం!

**::: స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడం ఎంతో ముఖ్యం.! గ్రామం అభివృద్ధి కావాలని కోరుకునే గ్రామ ప్రజలు ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామిని గెలిపించుకోవాలని తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఉప్పల విజయలక్ష్మి ,3.వ వార్డు అభ్యర్థి దోర్నాల బిక్షపతి గెలుపుకై ఇంటింటి ప్రచారం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు చిలువేరు సురేష్, మొగ్గుదల శంకరయ్య గౌడ్, రుద్ర భాస్కర్, చిలువేరు సంజీవ, పాత్రికేయులు సంగిశెట్టి ధనుంజయ్, విష్ణు గౌడ్, కేశవులు గుప్తా తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు

## మన గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఉప్పల విజయలక్ష్మిని గెలిపిద్దాం

**ఉంగరం గుర్తుకు ఓటు వేద్దాం.!**

**అభివృద్ధిని సాధిద్దాం - మోగుదాల శంకరయ్య గౌడ్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలి అనే ప్రతి ఒక్కరు, ఉప్పల విజయలక్ష్మి లింగస్వామిని గెలిపించుకోవాలని తెలిపారు, గత 10 ఏళ్ల పాలనలో గ్రామం అభివృద్ధిలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో నిత్యం ప్రజలతో మమేకమై కలిసి తిరుగుతున్న ఉప్పల విజయలక్ష్మి-లింగస్వామిని గెలిపించుకొని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు, గతంలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన నాయకులు గెలిచిన తర్వాత గ్రామ కందకాలను, గ్రామ భూములను అమ్ముకున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని తెలిపారు, గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి గత 7 సంవత్సరాలుగా గ్రామానికి సేవ, అభివృద్ధికి కృషి చేస్తున్న ఉప్పల లింగస్వామి కి మద్దతుగా గ్రామ ప్రజలు నిలవాలని తెలిపారు

## పంచాయతీ ఎన్నికల అనంతరం హింస

బాధితుల కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఎల్లారెడ్డి మండల కేంద్రానికి భారీగా చేరుకుని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. సర్పంచ్ పాపయ్యతో పాటు అతడి సోదరుడు చిరంజీవులుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలస్థాయి నేత కుర్మ సాయిబాబా అండతో రాజకీయ కక్షతోనే ఈ దాడి జరిగిందని వారు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బాధితులకు మద్దతుగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు చిరంజీవులును అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించి, ఎస్పీ రాజేశ్ చంద్రతో మాట్లాడారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో టీటీఎస్ సర్పంచ్ రవికుమార్‌పై దాడి జరిగింది. గ్రామస్థులకు కృతజ్ఞతలు చెప్పేందుకు ఇంటింటికీ తిరుగుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కర్రలు, సుత్తితో దాడి చేయడంతో రవికుమార్, వార్డు సభ్యుడు అనిల్ రెడ్డికి గాయాలయ్యాయి. అలాగే ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం ఇటిక్యాల పహాడ్‌లో సర్పంచ్ ఎన్నిక ఫలితాల నేపథ్యంలో మరో ఘర్షణ చోటుచేసుకుంది. స్వతంత్ర అభ్యర్థిగా ఓడిపోయిన నారాబాబు భర్త భీంరావు, గెలిచిన సర్పంచ్ తానుబాయి భర్త పోశెట్టిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. స్థానికులు భీంరావును బంధించి పోలీసులకు అప్పగించారు

## ప్రధాని మోడీని ఎవరూ దూషించలేదు

కాంగ్రెస్ చేపట్టిన ఓట్ చోరీ సభలో ప్రధాని మోడీని దూషించారంటూ పార్లమెంట్ ఉభయ సభల్లో బీజేపీ సభ్యులు ఆందోళన చేపట్టారు. సోమవారం సమావేశాలు ప్రారంభం కాగానే అధికార పార్టీ సభ్యులు నిరసన చేపట్టారు. రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో గందరగోళం నెలకొనడంతో సభ వాయిదా పడింది. ఇదే అంశంపై పార్లమెంట్ వెలుపల ప్రియాంకాగాంధీ మీడియాతో మాట్లాడుతూ క్లారిటీ ఇచ్చారు. ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో 'ఓట్ చోరీ' సభలో ప్రధాని మోడీని ఎవరూ దూషించలేదని తెలిపారు. వేదికపై నుంచి నాయకులెవరూ ఏం అనలేదని.. కానీ హాజరైన కార్యకర్తల్లో నుంచి ఒక కార్యకర్త ఆ వ్యాఖ్య చేశారని తమకు తెలిసిందన్నారు. కానీ అది ఎవరు అన్నారో మాత్రం స్పష్టంగా తెలియదని చెప్పారు.



## అస్తవ్యస్తంగా కొత్త దివిజన్ ల ఏర్పాటు..

### మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : కొత్త గా ఏర్పడిన డివిజన్ ల ఏర్పాటులో శాస్త్రీయంగా లేకుండా ఉన్నాయని రీకార్డులలో లేని మురికి కాలువలను హద్దులుగా చూపించారు.సుప్రీం కోర్టు కేసులో ఉన్న ప్రభుత్వ భూమిలో రోడ్ లేకున్నా రోడ్ ఉన్నట్టు హద్దులు చూపించారు.కాలనీలను రెండుగా చీల్చి హద్దులుగానిర్ణయించారు.బస్తీలన్నీ ఒక డివిజన్ గా ,కాలనీ లన్నీ ఒక డివిజన్ గా విడదీశారు.ఒక డివిజన్ కు తక్కువ జనాభా,ఒక డివిజన్ కు ఎక్కువ జనాభా ను చూపించారు..అధికార పార్టీ ప్రజా ప్రతినిధులకు అధికారులు సహకరిస్తున్నారు.అభ్యంతరం తెలపడానికి కనీసం మాప్ లను కూడా ఇవ్వడం లేదని మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి మాట్లాడుతూ అస్తవ్యస్థంగా,ప్రజలకు వ్యతిరేకంగా,అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా అధికారులు మరియు ప్రభుత్వ తీరును నిరసిస్తూ , డివిజన్ల ఏర్పాటును తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ బీ.ఆర్.ఎస్ పార్టీ తరపున శేరిలింగంపల్లి స్థానిక నాయకులతో కలిసి జి హెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ కి చందానగర్ సర్కిల్ 21 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ ని కలిసి డివిజన్ల ఏర్పాటుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ లిఖితపూర్వకంగా ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మిద్దెల మల్లారెడ్డి ,రోజా,అల్లావుద్దీన్,గౌస్,అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### మక్త మహబూబ్ పేట్ గ్రామ లో విద్యుత్ పోల్స్ పరిశీలన....

మియాపూర్ వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మియాపూర్ డివిజన్ లో గల మక్తా మహబూబ్ పేట్ గ్రామంలో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు పురాతనమై పక్కకు వంగిపోగా మరో చోట రోడ్డు మధ్యలో ఉందవి ప్రమాదభరితంగా మారాయనీ వీటి స్థానంలో కొత్త పోల్స్ వేయాలని గ్రామస్తులు అధికారులకు పిర్యాదు చేయగా స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సోమవారం రోజు గ్రామ%శీ% లో పర్యటించి వాటిని పరిశీలించారు. త్వరలోనే వీటిని మారుస్తామని అధికారులు తెలిపినట్లు బిజెపి సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ తెలిపాడు. ఈ కార్యక్రమంలో.లైన్ ఇన్స్పెక్టర్ రమేష్, లైన్ మెన్ పవన్, జాజేరావు శ్రీను, రాము లు పాల్గొన్నారు.

### విజయం సాధించిన వార్డ్ మెంబర్ రాజ్ కుమార్ కు ఘన సన్మానం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 15జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన సమీప అభ్యర్థిపైఅనుమల్ల రాజ్ కుమార్ 8 ఓట్లతో విజయం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాలకు చెందిన అర్జున్ డాక్టర్ అనుమల్ల రాజ్ కుమార్ ను ఘనంగా సన్మానించడం జరిగింది.



### శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో ప్రత్యేక పల్లకి సేవ

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి డిసెంబర్ 14

ఆదివారం భానువాసరే మార్గశిర మాసం శుక్ల పక్షం దశమి పర్వదినం సందర్భంగా జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగింది. సూర్య భగవానుని విశిష్టత : ఆదివారం %–% సూర్య భగవానుని ప్రత్యేక దినం. ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఆదివారం రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియ పర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగ వానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమ్మత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది. తదనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, వోద్నాల శ్రీనివాస్, భారతాల రాజ సాగర్, వడ్లగట్ట గోపి, పెద్ది శ్రీనివాస్, ఎలిమిల్ల సత్యనారాయణ, వేముల రాజేష్, నాగేశ్వర్, తిరుపతి, రఘు తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమం..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : సోమవారం రోజున తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో బి కే ఎంక్లెవ్ లోని వారి గృహం నందు వెంకటేశ్వర శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో అరుణ్ రెడ్డి ఆశీర్వాదంతో అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రణీత్ రెడ్డి కత్తి స్వామి, సంపత్ రెడ్డి గురుస్వామి, శివ గురు స్వామి, సునీల్ రెడ్డి గురుస్వామి, అజయ్ గురుస్వామి, సుభాష్ చంద్రబోస్, చలపతిరావు ముకుంద్ దాస్ సోనీ, సత్తిరెడ్డి, సురేందర్ రెడ్డి సీనియర్, సురేందర్ రెడ్డి జూనియర్, సీనియర్ జర్నలిస్ట్ లు బండి రామకృష్ణ గౌడ్, జెల్ల విజయ్ కుమార్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో స్వాములు, భక్తులు పాల్గొనీ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్నీ జయప్రదం చేసినందుకు నిర్వాహకులు గురు స్వామి సంతోష్ రెడ్డి ధన్యవాదములు తెలియజేశారు.

# అడ్డగోలుగా డివిజన్ల విభజన ప్రక్రియ

**జీహెచ్ఎంసీ పరిధిలోకి పలు డివిజన్ల కలుపుతూ ఉన్న**

**డివిజన్లు విభజిస్తూ ఇష్టారీతిగా 300 డివిజన్లు గా విభజించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**జనాభా ప్రాతిపదికన విభజించారా లేకా ఓటర్ల జాబితా ప్రకారం విభజించారా ,**

**ఏ ప్రాతిపదికన విభజించారో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది**

**బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్**



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : గత కొన్ని రోజుల క్రితం ఓ.ఆర్.ఆర్. లోపల ఉన్న ప్రాంతాలను జీహెచ్ఎంసీ పరిధిలోని తీసుకువస్తూ ఉన్న డివిజన్లు విభజిస్తూ ఇష్టారీతిగా 300 డివిజన్లు విభజిస్తూ డివిజన్ల సరిహద్దులను ప్రకటిస్తూ ఇచ్చిన జీవో పై అభ్యంతరాలను తెలుపుతూ సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ కి మరియు మాజీ శాసనసభ్యులు , బీజేపీ తెలంగాణ డెలిమిటేషన్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కి పలు డివిజన్ల విభజన ప్రక్రియ సరిగా చేపట్టలేదని , సరిగా సరిహద్దులను ఏర్పాటు చేయాలని కోరుతూ శేరిలింగంపల్లి బీజేపీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేసిన బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కదా అని అడ్డగోలుగా డివిజన్ల విభజించడం సరైన పద్ధతి కాదన్నారు, శేరిలింగంపల్లి డివిజన్ విభజన లో దాదాపు 70,000 ఓటర్లు అలాగే ఉన్నారన్నారు, మసీద్ బండ డివిజన్ 12 బూతులకే పరిమితమైందని, కావున శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహ కల్ప, ఆరంభ టౌన్ షిప్ ,సందయ్య నగర్, సురభి కాలనీ నుండి గోపి చెరువు నాలా మీద నుండి చాకలి చెరువు నాలా మీదగా అరబిందో గ్రేటర్ కమ్యూనిటీ లను మసీద్ బండ డివిజన్ లో కలపాలని, అలాగే బి. కే ఎన్క్లేవ్ డివిజన్ ను మక్త గ్రామస్థుల కోరిక మేరకు మక్త మహబూబ్ పేట్ డివిజన్ గా మార్చాలని కోరామన్నారు,అలాగే మాతృ శ్రీ నగర్ డివిజన్ సరిహద్దుల ఏర్పాటు కూడా గందరగోళంగా ఉందన్నారు, అసలు ఈ డివిజన్ల విభజన ప్రక్రియ జనాభా ప్రాతిపదికన విభజించారా లేకా ఓటర్ల జాబితా ప్రకారం విభజించారా ,ఏ ప్రాతిపదికన విభజించారో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు, గూగుల్ మ్యాప్ తో డివిజన్లను విభజించిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు, విభజన ప్రతిపాదన పెట్టినప్పుడు కనీసం ప్రజల నుండి గాని పొలిటికల్ పార్టీల నుండి గానీ సలహాలు ,సూచనలు తీసుకోవాలి అనే సోయా లేకుండా పోయిందన్నారు, మీరు ఇచ్చిన సరిహద్దుల లో ఏ కాలనీ , ఏ బస్తీ ఏ డివిజన్ పరిధిలోకి వెళుతుందో కనీసం ప్రభుత్వానికైనా తెలుసా అని ప్రశ్నించారు, ఇదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తే రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక జరిగినా మీ పార్టీ నీ, మీ ప్రభుత్వాన్ని ప్రక్కకు కూర్చోబెడతారన్నారు. తెలంగాణ ప్రజలు చాలా చైతన్యవంతులని మీరు చేస్తున్న ప్రతి ఒక్కటి గుర్తుపెట్టుకుని అన్నింటికీ ఒక్కరోజు సమాధానం చెబుతారని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, బుచ్చి రెడ్డి, కంటేస్టేడ్ కార్పొరేటర్ ఎల్లేష్, సీనియర్ నాయకులు వసంత్ యాదవ్, మొదలగు వారు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాముల దీక్ష కోసం వసతి కల్పించిన పద్మావతి బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

కమిటీ సభ్యులకు కృతజ్ఞతగా చిరు సన్మానం చేసిన టి. సుమిత్రన్ గురు స్వామి బృందం



ఎల్బీనగర్ 15 డిసెంబర్ బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ పద్మావతి బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ లో 41 రోజుల పాటు అయ్యప్ప స్వాములు దీక్ష తీసుకొని పూజలు చేసు కోవడానికి కమ్యూనిటీ హాల్ లో కమిటీ సభ్యులు సౌకర్యం కల్పించారు. అయ్యప్ప స్వాములు యొక్క సాధక బాధకాలను గుర్తించి మండల దీక్షలు చేసు కోవడానికి ఉచితంగా కమ్యూనిటీ హాల్ లో వసతి సౌకర్యం కల్పించిన కాలనీ సంక్షేమ సంఘం కార్య వర్గానికి సుమిత్ర గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల బృందం శాలువాతో సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా టి. సుమిత్రన్ గురుస్వామి మాట్లాడుతూ పేద మధ్య తరగతి వర్గాలకు చెందిన కన్నె స్వాములు మాల ధారణ కోసం తమ వద్దకు వస్తుంటారని చెప్పారు. కానీ వారికి 41 రోజుల పాటు మండల దీక్షలు చేసు కోవడం కోసం నివాసం ఉండడానికి వసతి సౌకర్యం లేని వారు అనేక మంది ఉంటారని చెప్పారు. అట్టి వారికి వసతి కల్పించడానికి తాను నివాసం ఉంటున్న పద్మావతి బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులను కలిసి అయ్యప్ప స్వాములను కమ్యూనిటీ హాల్లో వసతి సౌకర్యం కల్పించాలని కోరానని సుమిత్ర గురుస్వామి చెప్పారు. వెంటనే స్పందించిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్త రాజు గౌడ్ కార్యవర్గంతో మాట్లాడి కమ్యూనిటీ హాల్లో వసతి సౌకర్యం కల్పించారని గుర్తు చేశారు. 41 రోజుల పాటు మండల దీక్షలు చేసు కోవడానికి సహకరించినందుకు కృతజ్ఞతగా వారికి చిరు సత్కారం చేసి తమకు గుర్తుగా మెమొంటోలను అందజేసినట్లు సుమిత్రను గురుస్వామి వెల్లడించార. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొత్త రాజు గౌడ్, కార్యనిర్వహణ అధ్యక్షులు బి. రామయ్య, ప్రధాన కార్యదర్శి వై. కిషన్, కోశాధికారి పాండు రంగారావు, ఉపాధ్యక్షులు వై. సుభాష్, బి. రఘు రామారావు. కార్యదర్శులు సాయి కుమార్, టి. కిరణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వి.రవి కుమార్, మదన్, సలహాదారులు చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్ఎస్ఐ బెస్ట్ ఛాప్టర్ అవార్డు - 2025ను అందుకున్న హైదరాబాద్ ఛాప్టర్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 15...పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ ఎస్ ఐ) హైదరాబాద్ ఛాప్టర్ ప్రతిష్ఠాత్మక పిఆర్ఎస్ఐ బెస్ట్ ఛాప్టర్ అవార్డు%–%2025ను సొంతం చేసుకుంది.ఈ అవార్డును ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్లో డిసెంబర్ 13 నుంచి 15 వరకు నిర్వహించిన 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ ముగింపు సభలో ఉత్తరాఖండ్ ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాలు, అటవీ శాఖ మంత్రి సుబోధ్ ఉనియాల్ ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ ఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్మన్ డా. యాదగిరి కంభంపాటి, కార్యదర్శి కె. రాజేశ్తో పాటు ఛాప్టర్ సభ్యులు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించారు.మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా సుమారు 25 పిఆర్ఎస్ఐ ఛాప్టర్ల నుంచి 300కు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ కార్పొరేట్ పబ్లిక్ రిలేషన్స్ సంస్థలు కూడా ఈ కాన్ఫరెన్స్లో భాగస్వాములయ్యాయి.కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవానికి ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఉత్తరాఖండ్ శాసనసభ స్పీకర్ రీతూ ఖండూరి భూషణ్, ఉత్తరాఖండ్ మాజీ, రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్తో పాటు పలువురు ప్రముఖులు పిఆర్ఎస్ఐ నిర్వహించిన సదస్సు, సమావేశాలలో పాల్గొన్నారు.వరుసగా ఈ అవార్డును గెలుచుకున్న హైదరాబాద్ ఛాప్టర్ను పి ఆర్ ఎస్ ఐ జాతీయ అధ్యక్షుడు డా. అజిత్ పాఠక్, జాతీయ ఉపాధ్యక్షుడు (దక్షిణ భారతం) యు.ఎన్. శర్మ, ప్రధాన కార్యదర్శి పీఎల్కే మూర్తి మరియు జాతీయ కమిటీ సభ్యులు హైదరాబాద్ చాప్టర్ వారిని అభినందించారు.

## ఒక్క ఛాన్స్ ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా మోహన్ నాయక్ వేడుకోలు



కొండ మల్లేపల్లి డిసెంబర్ 15 వార్త మిర్రర్ గ్రామ అభివృద్ధి కోసం సేవ చేయడానికి ఒక యువకుడిగా ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ గ్రామ ప్రజలను వేడుకుంటున్న ఆంగోతు మోహన్ నాయక్ ఎక్కడో కాదు... కొండమల్లేపల్లి మండల ంలోని కేసియా తండా జోగ్య అంక్య తండా గ్రామపంచాయతీ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన ఉంగరం గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని మూడు తండాల గ్రామ ప్రజలను వేడుకున్నాడు. మీ కుటుంబ సభ్యుడిగా మీలో ఒకడిగా పెరిగిన నన్ను గెలిపించాలని తాండాల అభివృద్ధికి కృషి చేస్తానని ఇప్పటికే దేవాలయంలో ముగ్గుల పోటీలు కోలాటాలు వేయించానని దేవాలయ నిర్మాణాలు తోపాటు సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. తాను ఎంఎ ీడీవో కార్యాలయంలో ఎమ్మార్వో కార్యాలయంలో అధికారులతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఒక్కసారి తనకు ఛాన్స్ ఇచ్చి చూడాలని ఆయన ప్రజలను వేడుకున్నాడు నాతో పాటు పోటీ చేస్తున్నటువంటి పెద్దపెద్ద నాయకులైన మాజీ ఎంపీటీసీ మాజీ సర్పంచులను ఇప్పటికే చూశారని తన వద్ద డబ్బు లేదని తన సేవా కార్యక్రమాలను మాత్రమే చూడాలని తానును గెలిపిస్తే మీకు అందుబాటులో ఉంటూ మీ సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని మోహన్ నాయక్ తెలిపారు.

# జీడిపల్లిలో మత్స్యాభివృద్ధికి శ్రీకారం

### మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు



కల్వకుర్తి డిసెంబర్ 15 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి గ్రామంలో ఎర్రకుంట, పోసాని కుంట చెరువుల్లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లల వదలింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ బిడ్డ, గ్రామ ఉప సర్పంచ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు పాల్గొని మొత్తం 2,400 వివిధ రకాల చేప పిల్లలను చెరువుల్లో వదిలారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ... గ్రామాభివృద్ధిలో భాగంగా మత్స్య సంపద పెంపొందించడం ద్వారా గ్రామీణులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు గొర్ల శంకర్, డైరెక్టర్ కోలా అజయ్, యువకులు తదితరులు పాల్గొన్నారు



## తార్నాక డివిజన్లో విస్తృతంగా పర్యటించిన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 15...తార్నాక డివిజన్ లో కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆద సంతోష్ కుమార్ సోమవారం పర్యటించారు.తార్నాక డివిజన్ లోని సత్య నగర్, శాంతినగర్, జయశంకర్ స్టేడియం, డబుల్ బెడ్ రూమ్, లాలాపేట్, వినోబా నగర్, వివిధ బస్తీలలో చేపట్టిన రూ.3 కోట్ల 50 లక్షల పనులను పర్యవేక్షించి త్వరగా పనులు పూర్తయ్యేలా ప్రజలకు అందుబాటులో రావాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తానని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సురేష్ లాల్, బ్రహ్మాజీ, అమర్నాథ్, ప్రవీణ్ లాల్, కిషోర్, అనిరుద్, శ్యామ్, శేఖర్, శైలేందర్, రాజు, విశాల్, అశోక్, శ్రీను, లూథర్, మహేష్, కిరణ్, ప్రసాద్, అరుణ్, చక్రి, సురేష్ యాదవ్, శశాంక్, నరేష్, కిట్టు, హనుమంత్, గోపాల్,పవన్ పాల్గొన్నారు.

## ప్రజలకు,గర్భిణీలు, బాలింతలకు వరంగా 108,102 అత్యవసర సేవలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 15



అత్యవసర సేవలకు గర్భిణీలకు బాలింతలకు మహిళలకు వరంగా మారిన 108 102 వాహనాలు జిల్లావ్యాప్తంగా సేవలు అందిస్తున్నాయి. గర్భిణీలు ఇంటి నుండి ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు, చికిత్స అనంతరం వారి గమ్యస్థానాలకు చేర్చడం ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని తీసుకొచ్చింది. అలాగే 108 సేవలు రోడ్ సైడ్ యాక్సిడెంట్లు మరే ఇతరత్రా అన్ని రకాల అత్యవసర సేవలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. ఈ వాహనాలు జిల్లాలోని మాతా, శిశు ఆసుపత్రికి, వివిధ రకాల కమ్యూనిటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానంగా నిర్వహిస్తున్నారు. 108,102 వాహనం ద్వారా అందించే సేవలు మహిళలు, పిల్లలు, పెద్దలు, అపుడే పుట్టిన పిల్లల నుండి ప్రతి ఒక్కరికి అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా కేసు వచ్చిన వెంటనే 30 సెకండ్లలో వాహనము మూవ్ కావడం జరుగుతుంది. అలాగే పది నిమిషాలలో ప్రమాద స్థలం కి చేరుకొని అక్కడ ఉండే సంఘటన బట్టి సేవలు అందించే విధంగా చేస్తున్నట్లు, ప్రజలు 108,102 సేవలు ఉపయోగించుకోవాలని ఉమ్మడి జిల్లా మేనేజర్ భూమా నాగేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా మేనేజర్ ఐలయ్య ఉన్నారు.



## వీరమల్ల నరేష్ గౌడ్ పంచ దిన కార్యక్రమంలో పాల్గొన్న- స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధిసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన వీరమల్ల నరేష్ గౌడ్ పంచ దిన కార్యక్రమంలో పాల్గొన్న స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, మిత్రుడు వీరమల్ల జంగయ్య గౌడ్ ని పరామర్శించి,వీరమల్ల నరేష్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎదిగిన కుమారుడు మరణించడం బాధాకరమని అన్నారు, ఇంటికి అండగా నిలవాల్సిన కుమారుడు కోల్పోవడం తల్లిదండ్రుల బాధ వర్ణానితం అన్నారు, ధైర్యంగా ఉండాలని మిత్రుని ఓదార్చారు, ఈ కార్యక్రమంలో వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్, ఢిల్లీ వెంకట్ గౌడ్, బిజెపి నాయకులు వీరమల్ల అంజి గౌడ్, పాల్గొన్నారు



## కేంద్రానికి భెల్ 110 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: ప్రభుత్వరంగ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్) 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వానికి రూ.109.98 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది. కంపెనీలో 63.17 శాతం వాటా కలిగివున్న కేంద్రానికి ఈ డివిడెండ్‌కు సంబంధించిన చెక్‌ను కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామికి భెల్ సీఎండీ కే సదాశివ్ మూర్తి సోమవారం అందచేశారు. మొత్తంగా సంస్థ రూ.174.10 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది.

### ఎస్బీఐ యోనో 2.0 సేవలు

ముంబై, డిసెంబర్ 15: ఎస్బీఐ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను మరింత విస్తృత పరచ డంలో భాగంగా కొత్తగా యోనో 2.0ను ప్రారంభించింది. ఈ నూతన సేవలను బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నూతన సేవలను అం దించడానికి కొత్తగా 10 వేల మంది సిబ్బ ందిని నియమించుకోనున్నట్టు ప్రకటించారు.




## విద్యార్థుల సంక్షేమం కోసం ఇంజనీరింగ్ హాస్టళ్లను పరిశీలించి, కీలక సౌకర్యాలను ప్రారంభించిన ఉపకులపతి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 15...ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగురం ఇంజనీరింగ్ హాస్టళ్లను సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు మరియు మౌలిక సదుపాయాలను సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థుల సంక్షేమం మరియు నాణ్యమైన వసతి సౌకర్యాల పట్ల విశ్వవిద్యాలయ అంకితభావాన్ని ఈ సందర్శన మరోసారి స్పష్టంగా చూపించింది.భీమా హాస్టల్‌ను సందర్శించిన సందర్భంగా, పెండింగ్‌లో ఉన్న మరియు కొనసాగుతున్న పనుల పురోగతిని గౌరవ ఉపకులపతి పరిశీలించి, మిగిలిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు మరింత మెరుగైన నివాస వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ సూచనలు ఇచ్చారు.అనంతరం ఆయన ఇంజనీరింగ్ బాలికల హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన రెండు ముఖ్యమైన సౌకర్యాలను ప్రారంభించారు. గంటకు 150 లీటర్ల సామర్థ్యం గల కూలర్‌తో కూడిన ఇన్‌బిల్ట్ ఆర్‌ఓ తాగునీటి వ్యవస్థను ప్రారంభించి, సురక్షితమైన మరియు శుద్ధి చేసిన తాగునీటిని నిరంతరం అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే, హాస్టల్ రెండవ అంతస్తులోని పెద్ద హాలులో ఏర్పాటు చేసిన అల్యూమినియం పార్టిషన్‌ను ప్రారంభించి, బాలిక విద్యార్థులకు మరింత గోప్యతతో కూడిన, సౌకర్యవంతమైన నివాస వాతావరణాన్ని కల్పించారు.ఈ సౌకర్యాలు బి.ఇ. మొదటి సంవత్సరం విద్యార్థినులకు అంకితం చేయబడి, సుమారు 500 మంది బాలిక విద్యార్థులకు ప్రత్యక్ష లాభాన్ని అందించనున్నాయి. ఇది క్యాంపస్‌లోని నివాస సదుపాయాలను విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మెరుగుపరచడంలో ఒస్మానియా



విశ్వవిద్యాలయం తీసుకుంటున్న ముందడుగులకు నిదర్శనం.ఈ సందర్శన ద్వారా, గౌరవ ఉపకులపతి డైనమిక్ నాయకత్వంలో విద్యార్థుల సంక్షేమం, భద్రత మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి పట్ల ఒస్మానియా విశ్వవిద్యాలయం చూపుతున్న నిరంతర కట్టుబాటు మరోసారి ప్రతిఫలించింది.

# లీడర్ కావాలంటే మానవత్వం ఉండాలి

**నిజమైన నాయకుడు ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ని గెలిపించండి**

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 15( వార్త మిర్రర్):లీడర్ కావాలంటే ప్రజలల్లో మానవత్వం ఉండాలి అది ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి కి ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ప్రచార ర్యాలీని ప్రాచీన శివాలయం నుండి స్థానిక చౌరస్తా వరకు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ ఉంగరం గుర్తు పై



ఓటు వేసి ఉప్పల విజయలక్ష్మి గెలిపించాలని కోరారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి ఆరోపణలు ఎత్తిచూపుతో వారు మళ్ళీ స్థానిక ఎన్నికల బరిలో ప్రజలను మభ్య పెడుతూ వస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి మనం అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థిని గెలిపించుకుంటే గ్రామ అభివృద్ధికి ప్రభుత్వము నుండి పూర్తి సహకారం లభిస్తుందని ప్రజలకు విన్నవించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ,ఎంపీపీ గుత్తా ఉమాప్రేమ్ చందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జక్కిడి జంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ఏపూరి సతీష్, స్ఫూర్తి కళాశాలల చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్లు దేశిడి నరేందర్ రెడ్డి, కొండ్రెడ్డి నరసింహ, మాజీ ఎంపీటీసీ బచ్చన గౌని గాలయ్య, మోగుదాల శంకరయ్య గౌడ్, పందుల యాదగిరి గౌడ్, రాచకొండ రమేష్ బాబు, సూరపల్లి వెంకటేష్, వార్డ్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ, సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ నూతన కార్యవర్గ కమిటీ ఏర్పాటు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 15 ....శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఇటీవల నిర్వహించిన సాధారణ సమావేశంలో కొత్త కమిటీపై తుది నిర్ణయం తీసుకున్నారు. అధ్యక్ష పదవికి మక్తాల శేఖర్ గౌడ్, సంగం యాదగిరి లకు సమాన ఓట్లు రావడంతో సీనియర్ సభ్యుల సూచనల మేరకు, అధ్యక్షుడిగా మక్తాల శేఖర్ గౌడ్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మక్తాల శేఖర్ గౌడ్ కాలనీ వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా ఏకగ్రీవంగా అధ్యక్ష పదవిని నిర్వహించే అవకాశం కల్పించినందుకు గర్వంగా ఉందని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మళ్లీ అధ్యక్ష పదవిని అప్పగించినందుకు కాలనీ వాసులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధి, శుభ్రత, సౌహార్ద వాతావరణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కాలని వాసుల సూచనలతో కాలని అభివృద్ధి చేస్తానని తెలిపారు. శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా కటంగూరి శ్రీనివాస్ రెడ్డి, ఎన్. జోగేశ్వరరావు, లింగం యాదవ్, జనరల్ సెక్రటరీ గాసంగం యాదగిరి, ట్రెజరర్ కొప్పోజి



ప్రవీణ్ చారి,సంయుక్త కార్యదర్శులు గా యవవరమ్ నరేష్ శర్మ, సంతోష్, వైకుంటమ్ కార్యనిర్వాహక సభ్యులు గా గణేష్, వేణు,వీరు లను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే కాలంలో కాలనీ అభివృద్ధి కార్యక్రమాల్లో కమిటీ విశేష విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# ఎగుమతుల జోరు

**నవంబర్‌లో 19 శాతం అప్**

**ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ మెరుగైన పనితీరు**

**ఐదు నెలల కనిష్టానికి వాణిజ్య లోటు**

న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం నవంబర్‌లో బలమైన పనితీరు చూపించింది. అమెరికా టారిఫ్‌ల నడుమ సానుకూల వృద్ధి నమోదైంది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం నవంబర్‌లో 38.13 బిలియన్ డాలర్ల విలువైన వస్తు ఎగుమతులు జరిగాయి. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ గూడ్స్, కెమికల్స్, రత్నాభరణాలు వృద్ధికి తోడ్పడ్డాయి. దిగుమతులు 1.88 శాతం తగ్గి 62.66 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రధానంగా బంగారం, ముడిచమురు దిగుమతులు గణనీయంగా తగ్గాయి. దీంతో వాణిజ్య లోటు 24.53 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఐదు నెలల కనిష్ట స్థాయికి దిగివచ్చింది. అక్టోబర్ నెలకు వాణిజ్య లోటు 41.68 బిలియన్ డాలర్లతో పోల్చి చూసినా నవంబర్‌లో గణనీయంగా తగ్గినట్టు తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎగుమతులు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 2.62 శాతం పెరిగి 292.07 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దిగుమతులు సైతం ఇదే కాలంలో 5.59 శాతం అధికమై 515.21 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 223.14 బిలియన్ డాలర్లుగా ఉంది. టీ, కాఫీ, ఐరన్ ఓర్, జీడిపప్పు, డెయిరీ, హస్తకళాకృతులు, సముద్ర ఉత్పత్తులు, తోలు ఉత్పత్తుల ఎగుమతులు సైతం సానుకూలంగా నమోదయ్యాయి. బియ్యం, నూనె గింజలు, కార్పెట్, ప్లాస్టిక్స్ ఎగుమతులు క్షీణించాయి. సేవల ఎగుమతులు నవంబర్‌లో 35.86 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2024 నవంబర్‌లో వీటి ఎగుమతులు 32.11 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు సేవల ఎగుమతులు 270 బిలియన్ డాలర్లకు పెరిగాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 248.56 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రూ. 25,060 కోట్లతో ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌కు సంబంధించి సవివర మార్గదర్శకాలను ఖరారు చేస్తున్నట్టు వాణిజ్య శాఖ సెక్రటరీ రాజేష్ అగర్వాల్ తెలిపారు. కొన్నింటిని ఈ వారంలోనే అమల్లోకి తీసుకురానున్నట్టు చెప్పారు.



అమెరికా 50 శాతం టారిఫ్‌ల కారణంగా ఏర్పడిన ప్రభావం నుంచి ఎగుమతిదారులకు కొంత మేరకు ఉపశమనం లభిస్తుందన్నారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ.. 2025 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు భారత ఎగుమతులకు యూఎస్ ప్రధాన కేంద్రంగా ఉన్నట్టు 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్' (ఎఫ్ఐఈవో) ప్రెసిడెంట్ ఎస్‌సీ రల్హాన్ తెలిపారు. నవంబర్‌లో అమెరికాకు ఎగుమతులు బలపడ్డాయి. వరుసగా రెండు నెలల పాటు (సెప్టెంబర్, అక్టోబర్) క్షీణత తర్వాత.. నవంబర్‌లో 22.61 శాతం మేర అధికంగా 6.98 బిలియన్ డాలర్ల ఎగుమతులు యూస్ మార్కెట్‌కు వెళ్లాయి. భారత్‌పై 50 శాతం టారిఫ్‌లను ఆగస్ట్ నుంచి యూఎస్ అమలు చేస్తుండడం తెలిసిందే. అమెరికా నుంచి నవంబర్‌లో భారత్‌కు దిగుమతులు 38 శాతం పెరిగి 5.25 బిలియన్ డాలర్ల మేర ఉన్నాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు అమెరికాకు ఎగుమతులు 11.38 శాతం పెరిగి 59 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు 13.49 శాతం పెరిగి 35.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.